క్లుప్తంగా

వెండి కిరీటాల సమర్పణ



అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మకు వెండి కిరీటాలను అందజేస్తున్న పడాల సూర్రెడ్డి, పద్మ దంపతులు

రాయవరం: మండలంలోని సోమేశ్వరంలో బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు భక్తులు వెండి కిరీటాలు సమర్పించారు. సోమేశ్వరం గ్రామానికి చెందిన నల్లమిల్లి ఆదిరెడ్డి, సావిత్రి దంపతుల జ్ఞాపకార్థం వారి మనమరాలు పడాల సూర్రెడ్డి, పద్మ దంపతులు వెండి కిరీటాలను సమర్పించారు. ఉత్సవ విగ్రహాలకు అలంకరణ నిమిత్తం ఆలయ ప్రధాన అర్చకుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మకు గురువారం వెండి కిరీటాలను అందజేశారు. 286.100 గ్రాముల బరువు గల రజిత కిరీటాలను పండితులు స్వామివారికి అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

భారత సైనిక సత్తాకు ప్రతీక ఆపరేషన్ సిందూర్



పతివాడ నూక దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): ఉగ్రవాద స్థావరాలపై భారత సైనికులు ఆపరేషన్ సిందూర్ పేరుతో జరిపిన ప్రతి దాడి భారత సైనిక సత్తాకు ప్రతీకగా చరిత్రలో నిలుస్తోందని మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. ఈ మేరకు గురువారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలను మట్టుబెట్టడం భారతీయుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచుతోందన్నారు. ఉగ్రవాదులకు సింహస్వప్నంగా నిలిచిన భారతీయ సైనికులకు చైర్‌పర్సన్ కృతజ్ఞతలు తెలిపారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన ఆటో



పొలాల్లోకి దూసుకెళ్ల ఆగిన ఆటో

కాజులూరు: గొల్లపాలెం-యానాం రహదారిలో గురువారం ఓ ఆటో అదుపుతప్పి పొలాల్లోకి దూసుకుపోయింది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడకు చెందిన ఆటోడ్రైవర్ వాహనంలో ప్రయాణికులను ఎక్కించుకుని కాజులూరుకు బయలుదేరాడు. మండలంలోని గొల్లపాలెం-చేదువాడ గ్రామాల మధ్య రోడ్డు పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రోడ్డు మలుపులో ఎదురుగా వస్తున్న మరో ఆటోను తప్పించబోయి ఈ ఆటో అదుపుతప్పి పక్కనున్న పొలాల్లోకి దూసుకుపోయింది. ఆ సమయంలో వాహనంలో ముగ్గురు ప్రయాణికులు ఉన్నారు. పొలం పూర్తిగా ఎండి ఉండటంతో, ఆటో బోల్తా పడకుండా కొంతదూరం కుదుపులతో వెళ్లి ఆగింది. దీంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

ఉగ్రవాదంపై ఉక్కుపాదం

కాజులూరు: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాద స్థావరాలపై భారత్ జవాన్లు చేసిన ప్రతి దాడితో ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపినట్టయిందని బీజేపీ రామచంద్రపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దూడల శంకరనారాయణ అన్నారు. గురువారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ పహల్గాం ఘటనలో అమాయకులైన ప్రజలను పాకిస్తాన్ ఉగ్రవాదులు పొట్టన పెట్టుకున్నారన్నారు. భారత సైనికులు ప్రధాని మోదీ నేతృత్వంలో అమాయకులైన ప్రజలకు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా, కేవలం ఉగ్రవాదులు, వారి స్థావరాలే లక్ష్యంగా సమాధానం ఇచ్చిందన్నారు. ఇకపై పాకిస్తాన్ ఎటువంటి దుశ్చర్యలకు పాల్పడినా భారత సైనిక దళాలు అంతకు వంద రెట్లు సమాధానమివ్వడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి కల్యాణం



ద్రాక్షారామలో స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఈఓ

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసి ఉన్న రమా సత్యవతీ సమేత సత్యనారాయణ స్వామి దివ్య కల్యాణ వేడుక గురువారం ఘటనంగా జరిగింది. ఆలయ ఈఓ, దేవదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం , అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పుంత.. చింత

- అధ్వానంగా పుంత రోడ్లు
- చినుకుపడితే చిత్తడే..
- అసలే రానున్నది వర్షాకాలం
- పట్టించుకునే నాథుడు కరువు

కె.గంగవరం: పొలాల్లో పండిన పంటను తరలించడానికి పుంత రోడ్లు ఎంతగానో ఉపయోగపడతాయి. అలాంటి పుంత రోడ్లు అధ్వానంగా ఉండడంతో పంట ఉత్పత్తులను తరలించేందుకు రైతుల నానా కష్టాలు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే పుంత రోడ్లు మోకాలు లోతు బురదతో నిండిపోయి, కనీసం కాలినడకన వెళ్లేందుకు కూడా వీల్లేకుండా ఉన్నాయి. దీంతో పాటు వర్షాలు లేని రోజుల్లో కూడా పుంత రోడ్లు గోతులమయం కావడంతో ట్రాక్టర్లు బోల్తా పడుతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

పెరిగిపోతున్న ఖర్చు

పొలంలో పండించిన పంటను ఇంటికి, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు ట్రాక్టర్లు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో, కూలీల సాయంతో ధాన్యాన్ని రోడ్లపైకి చేరుస్తున్నామని రైతులు చెబుతున్నారు. దాంతో ఖర్చుల భారం పెరిగిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు ప్రధానంగా వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం రూరల్ మండలాల్లోని ప్రతి ఒక్కరూ వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి గ్రామంలో వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించేందుకు ప్రధాన మార్గమైన పుంత రోడ్లు పటిష్టంగా ఉండాలి. కానీ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. రెండు దశాబ్దాల క్రితం పుంత రోడ్లు అభివృద్ధి చేశారని, ఆ తరువాత ఆ సంగతి పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. ప్రధానంగా పాణింగపల్లి, భట్లపాలిక, మసకపల్లి, కూళ్ల, అముజూరు, వెంకటయ్యపాలెం, కాజులూరు, మంజేరుతో పాటు, పలు గ్రామాల్లోని పుంత రోడ్లు మరీ అధ్వానంగా మారాయి.

కమిటీల నిర్లక్ష్యం!

మార్కెట్ కమిటీలు పుంత రోడ్లను అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రతి బస్తాకు మార్కెట్ కమిటీ సెస్ వసూళ్లు చేస్తున్నప్పటికీ.. పుంత రోడ్ల అభివృద్ధి విషయంలో నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నాయని రైతుల ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం పంట కోతకు చేరుకున్న తరుణంలో పంట ఉత్పత్తులను ఎలా గట్టెక్కించాలో రైతులు మథనపడుతున్నారు. చిన్నపాటి వర్షం పడితే ట్రాక్టర్లు సైతం వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పుంత రోడ్లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న దంగేరు పుంత రోడ్డులో ప్రయాణిస్తున్న ట్రాక్టర్

పూర్తి స్థాయిలో నిర్మించాలి



గ్రామాల్లో చివరి పొలం వరకూ పుంత రోడ్లు నిర్మించాలి. పుంత రోడ్లు సక్రమంగా లేకపోవడంతో సాగు ఖర్చు పెరిగిపోతుంది. ప్రస్తుతం పుంత రోడ్లు గోతులు, తుప్పల మయంగా మారాయి. పట్టించుకునే నాథుడే లేడు.

– తోకల శ్రీను, కౌలు రైతు, తామరపల్లి

పాలకులు స్పందించాలి



పుంత రోడ్లు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోలేదు. చాలా గ్రామాల్లోని పొలాలకు అసలు పుంత రోడ్లే లేవు. పాలకులు స్పందించి వెంటనే పుంత రోడ్ల నిర్మాణం, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

– బత్తుల అప్పారావు, మాజీ సభ్యులు, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ, కుందూరు

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి



మండపేటలో నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

కపిలేశ్వరపురం (మండపేట): దీర్ఘకాలంగా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో సేవలందిస్తున్న తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ మండపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు పి.సుబ్బరాజు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. 15 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకొన్న ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు హెచ్‌ఆర్ పాలసీను అమలు చేయాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో కప్పల సురేంద్ర, టేకి వెంకన్న, పిట్టా ప్రవీణ్, గంధం మధు, గంటి నవీన్ కుమార్, వెంకటేశ్వర్లు, తలాటి వెంకన్న భాస్కర్ పాల్గొన్నారు.

జోరుగా మట్టి నమూనాల సేకరణ



ఆరబెట్టిన మట్టి నమూనాలు



ల్యాబ్‌కు పంపించేందుకు సిద్ధం చేసిన మట్టి

రాయవరం: మండలంలో మట్టి నమూనాల సేకరణ జోరుగా సాగుతోంది. మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది జీపీఎస్ విధానంలో మట్టి నమూనాలను సేకరిస్తున్నారు. ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో 55 చొప్పున నమూనాలను సేకరిస్తున్నారు. సేకరించిన మట్టి నమూనాలను ఆరబెట్టి ప్యాకింగ్‌లు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో మట్టి నమూనా సేకరించిన రైతు పేరు, సర్వే నంబరు, ఆధార్‌కార్డు నంబరుతో పాటు సెల్ నంబరును నమోదు చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు 586 మట్టి నమూనాలను సేకరించినట్లు మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ తెలిపారు. సేకరించిన మట్టి నమూనాలను భూసార పరీక్షా కేంద్రానికి పంపించి ఫలితాలను రైతుల సెల్ నంబర్లకు నేరుగా పంపిస్తామన్నారు. వచ్చిన ఫలితాల ఆధారంగా రైతులు భూసారాన్ని తెలుసుకుని అందుకనుగుణంగా యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్యప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

రాయవరం: స్థానిక శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు హైదరాబాద్ రవీంద్రభారతిలో గురువారం చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. ఈ విషయాన్ని విద్యార్థినులకు శిక్షణ ఇచ్చిన నాట్య గురువు చక్రవర్తుల పవన్‌కుమార్ విలేకరులకు తెలిపారు. గ్రామానికి చెందిన ఎం.శరణ్య, దీపిక, ఎం.చరిష్మ, గుడాల దీపిక రెండేళ్ల పాటు శిక్షణ పొందారు. రవీంద్రభారతిలో జరుగుతున్న కళా ఉత్సవంలో తొలి ప్రదర్శన ఇచ్చారు. విద్యార్థినులకు నిర్వాహకులు సర్టిఫికెట్లు, మెమెంటోలను అందజేశారు. నృత్య ప్రదర్శన చేసిన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం వీఎస్ సునీత, ఉపాధ్యాయులు, పలువురు గ్రామస్తులు అభినందించారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం



ద్వారపూడిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం (మండపేట): గ్రామాల్లో మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ద్వారపూడి 2వ సచివాలయం సమీపంలోని కమ్యూనిటీ హాల్‌లో వెనుకబడిన తరగతులు సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణను గురువారం ఎమ్మెల్యే వేగుళ్ల ప్రారంభించారు. ద్వారపూడి, వేములవాడ, జెడ్.మేడపాడు, చిన్న ద్వారపూడి, కేశవరం గ్రామాలకు చెందిన 125 మందికి కేంద్రంలో శిక్షణ ఇవ్వనున్నారు. కేంద్రంలోని నైపుణ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీఓ దాసరి శ్రీనివాస్, ఆయా గ్రామాల కార్యదర్శులు, నాయకులు ఉండమట్ల శ్రీనివాస్, గజ్జి వెంకటరమణ, చేకూరి రమేష్‌రాజు, యరగతపు బాబ్జి, సత్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ



కలెక్టర్ చేతులు మీదుగా ల్యాప్‌టాప్ అందుకుంటున్న తహసీల్దార్, రెవెన్యూ బృందం

కపిలేశ్వరపురం (మండపేట): జిల్లా స్థాయి రెవెన్యూ ఉద్యోగుల క్విజ్ పోటీల్లో మండపేట తహసీల్దార్ పి.తేజేశ్వరరావు బృందం ప్రథమ స్థానంలో నిలిచింది. అమలాపురం కలెక్టరేట్‌లో గురువారం జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ చేతులు మీదుగా ల్యాప్‌టాప్, జ్ఞాపికలను అందుకున్నారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన తహసీల్దార్ పి.తేజేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ కె.కళ్యాణి, మండల సర్వేయర్ ఎం.సుజాత, జూనియర్ సహాయకులు ఎం.హరి చందన, అర్తమూరు వీఆర్వో కె.రవికుమార్, వీఆర్వో పి.వి జయ రాజు, తాపేశ్వరం సర్వేయర్ జి.నారాయణ మూర్తిలను జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ అభినందించారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ పీపీ మెహర్ బాబా, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ ఎం .శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి



మాక్ డ్రిల్‌లో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు

ఎస్సై నాగేశ్వరరావు

రామచంద్రపురం: ప్రస్తుతం దేశంలో యుద్ధ ఉద్రిక్తత నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పట్టణ ఎస్సై ఎస్.నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అగ్నిమాపక, ఆర్టీసీ అధికారులతో కలిసి మాక్ డ్రిల్ నిర్వహించి, పట్టణ ప్రజలకు యుద్ధ పరిస్థితులపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించి, ఏదైనా ముప్పు సంభవిస్తే ఎలా ఉండాలనే దానిపై వివరించారు. ఈ సందర్భంగా ఎస్సై నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఏదైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉండాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలు ధైర్యంగా ఉండాలని కోరారు. డిపో మేనేజర్ భాస్కరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

లఖ్‌పతీ దీదీ యోజనను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ బ్యాంక్ రాజమహేంద్రవరం రీజినల్ హెడ్ విశ్వేశ్వరరావు

రాయవరం: కేంద్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అమలు చేస్తున్న లఖ్‌పతీ దీదీ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ రాజమహేంద్రవరం రీజనల్ హెడ్ ఎ.విశ్వేశ్వరరావు పిలుపునిచ్చారు. యూనియన్ బ్యాంకు రాయవరం శాఖలో గురువారం లఖ్‌పతీ దీదీ స్కీమ్‌తో పాటుగా పలు పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు, మహిళలు, వివిధ వర్గాల ప్రజల కోసం బ్యాంకు ద్వారా అమలవుతున్న నారీశక్తి, పీఎంఈజీపీ, కిసాన్ క్రెడిట్ కార్డు స్కీమ్, లఖ్‌పతీ దీదీ యోజన తదితర పథకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఖాతాదారులకు, మహిళా శక్తి సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. అనంతరం అర్హులైన సంఘాల్లో ఒక్కో సంఘానికి రూ.20 లక్షల రుణాలను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ హెడ్ మనోజ్, వెలుగు ప్రాజెక్టు మేనేజర్ డి.అన్నపూర్ణ, చీఫ్ మేనేజర్ వి.సత్యనారాయణ, యానిమేటర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎం.శ్రీదేవి, వీఓఏలు రాణి, సద్మ, దేవి, సౌజన్య, ఖాతాదారులు, రైతులు, మహిళా శక్తి సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామికి రుద్రాభిషేకం



తాతపూడిలో రుద్రాభిషేకం పూజలు చేస్తున్న అర్చకులు

కపిలేశ్వరపురం: మండలంలోని తాతపూడిలో వేంచేసిన పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో గురువారం మహామృత్యుంజయ పాశుపత రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాగాపు వీరభద్ర శివాచార్య అర్చక పర్యవేక్షణలో స్వామిని విశేషంగా అలంకరించారు. స్వామికి ఆరాధన, నక్షత్ర పూర్వ నవగ్రహారాధన, మంటపారాధన తదితర పూజలు చేశారు. గ్రామానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కపిలేశ్వరపురంలో..

స్థానిక శ్రీదుర్గామాతా సమేత పార్వతీ పాపవినాసేశ్వరస్వామి, పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి దివ్య కల్యాణం గురువారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకుడు కాలధరి కార్తికేయ శర్మ ఆధ్వర్యంలో కల్యాణ పూజలు చేశారు. గ్రామానికి చెందిన భక్తులు కల్యాణాన్ని తిలకించారు. శుక్రవారం విశేషార్చన, 10న సదస్య మహోత్సవం, 11న నిత్యహోమం, 12న గ్రామోత్సవం, 13న శ్రీపుష్ప యాగం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

కపిలేశ్వరపురం (మండపేట): శ్రామికవర్గ సమస్యల పరిష్కారం కోసం భారత కార్మిక సంఘాల సమాఖ్య పిలుపు మేరకు ఈ నెల 20న నిర్వహించ తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. మండపేట కొత్త బస్టాండ్ వద్ద గురువారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సమ్మె సన్నాహక సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ సమ్మెలో రైస్ మిల్లు జట్టు కార్మికులు విరివిగా పాల్గొనాలన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం, చింతా రాజారెడ్డి, గంధం శ్రీను, చల్లా శ్రీను, మేడపాటి సత్తిబాబు, విన్నకోటి సత్యనారాయణ, కంబాల సత్తిబాబు పాల్గొన్నారు

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



ద్రాక్షారామలో వేంకటేశ్వర స్వామివారి కల్యాణ వేడుక

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో వేంచేసి ఉన్న అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దివ్య కల్యాణం గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, దాత సత్తి సుబ్బారెడ్డి, సీతారత్నం దంపతుల ఆధ్వర్యంలో మేడవరపు శ్రీనివాస చింతామని బ్రహ్మత్వంలో కల్యాణం జరిగింది. కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం సత్తి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ద్రాక్షారామతో పాటు, పరిసర గ్రామాల భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

'నక్కిన' ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



ధ్రువీకరణ పత్రంతో రాఘవరావు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణానికి చెందిన తెలుగు పండితుడు నక్కిన వీర రాఘవరావుకు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కింది. ఆ మేరకు సంస్థ నుంచి ఉత్తర్వు అందినట్టు గురువారం రాఘవరావు తెలిపారు. సాహిత్య రంగంలో చేస్తున్న కృషికి గాను ఆయన అవార్డుకు ఎంపికయ్యారు. త్వరలో దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించే కార్యక్రమానికి రాఘవరావు హాజరుకానున్నారు. తెలుగు ఉపాధ్యాయుడిగా, పాఠ్యపుస్తక రచయితగా, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా మండలి విషయ నిపుణుడిగా రాఘవరావు వ్యవహరిస్తున్నారు. తెలుగు సాహిత్యంలో సేవలందించిన కవులు, రచయితలుపై పరిశోధన వ్యాసాలు రాసారు.

కల్యాణం.. కమనీయం

- వైభవంగా సోమేశ్వర, రాజరాజేశ్వరస్వామి కల్యాణోత్సవాలు
- వేలాదిగా తిలకించిన భక్తులు



రాయవరంలో కల్యాణ అలంకరణలో పార్వతీ సమేత రాజేశ్వరస్వామి

రాయవరం: మండలంలోని సోమేశ్వరం, రాయవరం, వెదురుపాక, వెంటూరు గ్రామాల్లో స్వామి వార్ల కల్యాణోత్సవాలు గురువారం రాత్రి కన్నుల పండువగా జరిగాయి. మండలంలోని సోమేశ్వరంలో బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వర స్వామి, రాయవరంలోని పార్వతీ సమేత రాజరాజేశ్వరస్వామి, వెదురుపాకలోని పార్వతీ సమేత సోమేశ్వరస్వామి, వెంటూరులోని ఉమా సోమేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామి, వెదురుపాకలో రమా సత్యనారాయణస్వామి వార్ల కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సోమేశ్వరస్వామి ఆలయంలో ఉదయం స్వామివారిని, అమ్మవారిని పెండ్లికొడుకు, పెండ్లి కుమార్తెలుగా అలంకరించారు. పెళ్లి పనులు ప్రారంభానికి సూచికగా ముత్తైదువులు పసుపు దంచారు. ఆలయ అర్చకుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ అర్చకత్వంలో విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, త్రిశూలపూజ, అంకురారోపణ, ధ్వజారోహణ, అగ్నిప్రతిష్ఠాపన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటలకు స్వామి, అమ్మవార్లకు నంది వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. రాయవరంలో పార్వతీ సమేత రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు విలపర్తి ఫణిందర్‌శర్మ, శశిధర్ శర్మ ఆధ్వర్యంలో భక్తుల శివనామస్మరణ నడుమ శాస్త్రోక్తంగా కల్యాణాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. వెంటూరులో ఉమాసోమేశ్వరస్వామి కల్యాణాన్ని ఇంద్రకంటి విశ్వనాథం, మద్దిరాల సాయికిరణ్‌శర్మ ఆధ్వర్యంలో నందూరి సూర్యసత్యనారాయణ, హంసవతి దంపతులు నిర్వహించారు. వెంటూరులో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకేశవస్వామి కల్యాణం వాడపల్లి వేణుగోపాలాచార్యులు, పెద్దింటి విజయజనార్దన్ ఆధ్వర్యంలో రిమ్మలపూడి వీర్రాజుచౌదరి, లక్ష్మీనారాయణమ్మ దంపతులు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాలను తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



సోమేశ్వరంలో నంది వాహనంపై స్వామివారి గ్రామోత్సవం